


డిఆర్‌ఓగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులైన ఎం.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలను స్వీకరించారు. తొలుత వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు. వెంకటేశ్వర్లు గతంలో కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారిగా ఎంతో సమర్థవంతంగా పనిచేసి అందరి మన్ననలు పొందారు.

లోటు వర్షపాతం..!



ముగిసిన వానాకాలం
జులైలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు
మూడునెలలు సరిగా పడని వర్షాలు
భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం
ఆందోళనలో మెట్టప్రాంత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ ఏడాది సరిపడు వర్షాలు పడకుండానే వానాకాలం ముగిసింది. నాలుగు నెలల వర్షాకాలంలో ఒక్కనెలలో మాత్రమే సాధారణ వర్షం కురవడంతో లోటు వర్షపాతం ఏర్పడింది. ప్రస్తుతం పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ లోటువర్షపాత ప్రభావం రానున్న కాలంలో మెట్టప్రాంతంలో తీవ్రంగా పడుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేపట్టారు. వర్షాలు సరిగా పడకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాంతం కావడంతో వర్షాలు తక్కువగా పడినప్పటికీ కాలువల ద్వారా గోదావరి నీరు వస్తుండటంతో ఖరీఫ్‌సాగుకు పెద్దగా ఇబ్బందిలేదు. మెట్టప్రాంతంలో పరిస్థితి పూర్తిభిన్నంగా ఉంది. ప్రాజెక్టుల కింద కొంతమేర సాగు ఉన్నప్పటికీ అత్యధికంగా మోటారు బోర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాభావంతో మెట్టప్రాంతంలోని చెరువులు అడుగంటడంతోపాటు, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో లోటువర్షపాత ప్రభావం వచ్చే రబీలో తీవ్రంగా చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ నాలుగ నెలలు కురిసే వర్షాల ఆధారంగానే మెట్ట ప్రాంతంలో చెరువుల నీటిమట్టాలు, భూగర్భజలాలు పెరగడం వంటివి జరుగుతాయి. నీటిమట్టాలు పెరిగితే బోర్లు భాగా పనిచేసి రబీలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఈ ఏడాది జూన్‌లో సరాసరిగా 112.5 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 86.3 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 23.3 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఏర్పడింది. జులై నెలలో 242.9 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 319.8 మిల్లీ మీటర్లు కురవడంతో 31.7 మిల్లీమీటర్ల వర్షం అదనంగా పడింది. ఆగస్టులో 212.4 మిల్లీమీటర్ల వర్షపాతం పడాల్సి ఉండగా 90.9 మిల్లీమీటర్లు వర్షం మాత్రమే పడటంతో 57.2 మిల్లీమీటర్ల వర్షపాతలోటు ఏర్పడింది. సెప్టెంబర్‌లో 171.5 మిల్లీ మీటర్లకు 137 మిల్లీమీటర్లు పడటంతో 20.1 మిల్లీమీటర్ల వర్షపాత లోటు ఏర్పడింది. వానలు సరిగా కురవకపోడంతో మెట్టప్రాంతంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు. పోలవరం, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల మండలాల్లో వర్షం భాగా తక్కువ పడింది. దీంతో ఆయా మండలాల్లో చెరువులు అడుగంటాయి. దీంతో పశువులకు సైతం తాగునీటి ఇబ్బందులు ఏర్పడిందని చెబుతున్నారు. వర్షపాతం లోటుతో వచ్చే రబీలో తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోర్ల నుంచి నీరు సరిగా వచ్చే పరిస్థితి ఉండదు. అదే జరిగితే సాగునీరు అందక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ చింతలపూడి, ద్వారకాతిరుమల, పోలవరం, కొయ్యలగూడెం వంటి అనేక మండలాల్లో పంటలపై తీవ్ర ప్రభావం పడనుంది. వర్షాలు సరిగా కురవకపోవడంతో డెల్టాలో సైతం పంటలు ఏపుగా పెరగకపోవడం, తెగుళ్లు సోకడం వంటి సమస్యలున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షపాతం లోటుతో వచ్చే సమస్యలను ప్రభుత్వం ఏవిధంగా పరిష్కరిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

నాలుగునెలల వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

నెల	కురిసిన వర్షం	కురవాల్సిన వర్షం	లోటువర్షపాతం
జూన్	86.3	112.5	-23.3
జులై	319.8	242.9	ప్లస్31.7
ఆగస్టు	90.9	212.4	-57.2
సెప్టెంబర్	137	171.5	-20.1



హాజరైన జనం



బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

సంప్రదాయ చేపల వేటకు చర్యలు
కొల్లేరు కాలుష్యాన్ని అరికడతాం
ఆరు నెలల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం
కైకలూరు ఎంఎల్‌ఎకు, ఆయన కొడుకుకు బుద్ధి చెబుతాం
అదేపోలీసులతో సమాధానం చెబుతాం
ముదినేపల్లి సభలో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ముదినేపల్లి

'కొల్లేరులోని 52 మత్స్యకార సంఘాలను వైసిపి నిర్వీర్యం చేసింది.. రోడ్లు గానీ, తాగునీటి సమస్యగానీ పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకొచ్చాక కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం. సంప్రదాయ చేపల వేటకు అవసరమైన చర్యలు చేపడతాం. మత్స్యకార సంఘాలకు అండగా ఉంటాం' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం పవన్ ఏలూరు జిల్లాలోని ముదినేపల్లిలో పర్యటించారు. ముందుగా మచిలీపట్నం నుంచి బయలుదేరి ఆయన పెడన, బంటుమిల్లి మీదుగా ముదినేపల్లి చేరుకున్నారు. దారిపొడవునా పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం లభించింది. సాయంత్రం ముదినేపల్లిలో జరిగిన బహిరంగసభలో పవన్ మాట్లాడారు. ఒకపక్క 175 సీట్లు వస్తాయంటూ చెబుతున్న వైసిపి జనసేనను చూసి భయపడుతుందన్నారు. తాము ఎన్‌డిఎలో ఉంటే వారికేంటి లేకపోతే ఏంటి అని ప్రశ్నించారు. మరో ఐదునెలల్లో తేలుస్తామన్నారు. తెలంగాణ ఎన్నికలతో వెళ్లినా తామేంటో తేలుస్తామని చెప్పారు. 2009లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని ఎదుర్కొని నిలబడ్డానని, తమకు భయపడేవాళ్లం కాదన్నారు. 2014లో టిడిపి, బిజెపికి మద్దతిచ్చామని తెలిపారు. కైకలూరులో జనసైనికులను ఇబ్బంది పెడుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి కేసులు సైతం పెడుతున్నారని, వాటికి తగిన సమాధానం చెబుతామన్నారు. రూ.14 కోట్లతో పెద్దింట్లమ్మ గుడికి వంతెన నిర్మించలేకపోయారని వైసిపిని విమర్శించారు. కైకలూరు ఎంఎల్‌ఎ, ఆయన కొడుకు దౌర్జన్యాలు చూస్తు ఊరుకోబోమని, భవిష్యత్తులో దెబ్బకు దెబ్బ చూపిస్తామన్నారు. పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారన్నారు. అదే పోలీసులతో మక్కెలు విరగకొట్టిస్తామన్నారు. కొల్లేరు ప్రజలకు టిడిపి, జనసేన కూటమి న్యాయం చేస్తుందన్నారు. రోడ్లు వేయరు, బ్రిడ్జిలు కట్టరు గానీ, ప్రశ్నించిన వారిపై కేసులు మాత్రం పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకొచ్చాక కొల్లేరు పరిధి మొత్తం ప్రజలకు చూపిస్తామన్నారు. కలిదిండిలో రోడ్డు వేయలేదని, వినాయక చవితి లడ్డూ పాట సొమ్ముతో రోడ్డు వేసుకుంటామంటే ఎంఎల్‌ఎ అడ్డుపడటం సిగ్గుచేటన్నారు. ముదినేపల్లి మండలంలో ఆరువేల మందికి తాగడానికి నీళ్లులేవని వినితి ఇచ్చారన్నారు. వాటర్‌ప్లాంట్‌లో శుద్ధిచేసే వ్యవస్థ లేదని, కిడ్నీలు దెబ్బతింటున్నాయని జనం చెబుతున్నారన్నారు. టిడిపి, జనసేన కూటమి వచ్చిన ఆరునెలల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పంచాయతీ నిధులను కాజేస్తే పనులు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. ఉదయం పథకం కింద డబ్బులు.. సాయంత్రం మద్యం పేరుతో దోపిడీ ఇదే రాష్ట్రంలో జరుగుతుందన్నారు. ఆడపడుచులు కోరుకుంటే ఆయా గ్రామాల్లో మద్యం నిషేధిస్తామన్నారు. అధికారంలోకొచ్చిన నెలరోజుల్లో మద్యం ధరలు తగ్గించి పాతధరలు అమలుచేస్తామన్నారు. కొల్లేరు కాంటూరు లెక్కలు జగన్‌కు తెలియవన్నారు. కొల్లేరులోకి 567 డ్రెయిన్ల నుంచి 17 వేల టన్నుల కాలుష్యం కలుస్తుందన్నారు. కాలుష్యాన్ని శుద్ధి చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. కైకలూరును నగరపంచాయతీ చేయలేకపోయారని, తాము అధికారంలోకొచ్చాక మినీపట్టణంగా మారుస్తామన్నారు. ఆక్వా రైతులకు అండగా ఉంటామన్నారు. 2021లోనే ఓట్లు చీలని వ్వనని చెప్పానని, అదేమాటకు కట్టుబడి ముందుకు సాగుతున్నామన్నారు. సంక్షేమ పథకాలు ఆపేస్తారని వైసిపి ప్రచారంలో నిజం లేదన్నారు. టిడిపి, జనసేన నాయకులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. దశాబ్ద కాలం పాటు కలిసిమెలిసి పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. జగన్‌ను ఇంటికి పంపించే సమయం అసన్నమైందని, హలో ఎపి.. బైబై జగన్ అంటూ తన ప్రసంగం ముగించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్టేడియాలను అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

దేశానికి యువతే వెన్నెముక అని, వారు శారీరకంగా, మానసికంగా అభివద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పిన మహనీయుల మాటలు నెరవేరాలంటే ఈనాటి ప్రభుత్వాలు, అధికారులు పాడైపోయి, శిథిలావస్థలో ఉన్న స్టేడియాలకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పున:నిర్మాణం చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏలూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియం భవనం శిథిలావస్థలో ఉండడంతో పైకప్పు కుప్పకూలిపోయిందని తెలిపారు. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయాలని, లేకుంటే గోడలు అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏలూరులో పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ఉన్న స్టేడియం గానీ, కలెక్టర్ ఆఫీస్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియం గానీ ఎంతోమంది యువతి, యువకులను శారీరకంగా అభివృద్ధి చేయడంలో ఉపయోగపడ్డాయని తెలిపారు. క్రీడల్లో తర్ఫీదు పొంది జిల్లాకు బహుమతులు తెచ్చి పెట్టడంలో స్టేడియాల పాత్ర మరువరానిదని పేర్కొన్నారు. కేవలం యువతి, యువకులకే కాకుండా నగరంలోని ప్రజానీకానికి వాకింగ్ చేసి తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు కూడా స్టేడియాలు ఉపయోగపడ్డాయనే విషయాన్ని మరువరాదని తెలిపారు. ఈ స్టేడియంలోనే శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పొంది ఉన్నత స్థానాల్లో నిలిచిన వారు అనేకమంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ముందుకెళ్లాలన్నా, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా లిక్కర్ పైనే ఆధారపడాలన్న ఈ ప్రభుత్వాలు స్టేడియాల అభివృద్ధికి కృషి చేయకపోవడం బాధాకరమన్నారు. నేటి పరిస్థితుల్లో యువతి, యువకులు వ్యసనాలకు బానిసలు కాకుండా, మత్తు పదార్థాలకు లోనవ్వకుండా ఉండేందుకు వారిని క్రీడలవైపు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, జిల్లా అధికారులపై ఉందని స్పష్టం చేశారు.


మహిళా, కార్మిక వ్యతిరేకి బిజెపిని గద్దెదించాలని, మహిళా రిజర్వేషన్ చట్టం తక్షణం అమలు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యాన ఢిల్లీలో గురువారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఏలూరు జిల్లా ఐద్వా, సిపిఎం నేతలు



చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చంద్రబాబు నాయుడు అరెస్టుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయని చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ గంటా మురళీ రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని గురవాయిగూడెం టిడిపి కార్యాలయం వద్ద 23వ రోజు గురువారం టిడిపి రిలే నిరాహార దీక్ష కొనసాగింది. టిడిపి మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కుక్కల మాధవరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు గోలి అనిల్ నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గంటా మురళీ రామకృష్ణ, మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ చంద్రబాబుపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసిపి ప్రభుత్వం అసూయ పడుతుందన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తారిపిరెడ్డి రామకృష్ణ, రాగాని శ్రీను, గంధం గోపాలకృష్ణ, ఎలికే ప్రసాద్, రాగాని రామకృష్ణ, పాతూరి రామచంద్రరావు, తడికల దావీదు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి యడ్ల తేజేశ్వరరావు, ఇర్రి రఘు, తడికల ధర్మరాజు, జనసేన వార్డు మెంబర్ నులకానీ వాసు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో టిడిపి నిరసన దీక్ష

ముసునూరు :చంద్రబాబును అన్యాయంగా జైలులో పెట్టడం దారుణమని పలువురు టిడిపి నేతలు అన్నారు. చంద్రబాబు అరెస్టుపై మండలంలోని గుడిపాడులో చేపట్టిన నిరాహార దీక్షలో టిడిపి నేతలు గద్దె రఘుబాబు, భాను, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, సుబ్బారావు, కందుల పిచ్చియ్య, మేదరమెట్ల సురేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - కుక్కునూరు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, వేళాపాలాలేని అప్రకటిత విద్యుత్ కోతలను ఆపాలని కోరుతూ సిపిఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల పేరుతో అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని, వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తూ మండలాన్ని అంధకారంలో ఉంచుతున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో లేని రైతుల వ్యవసాయ భూముల్లోని బోర్ల మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అప్రకటిత కోతలు ఆపాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు కొండా ప్రసాద్, వీరబాబు, సత్యనారాయణ, లక్ష్మయ్య, సుభద్ర, దుర్గమ్మ, మహేష్ పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులకు వినతిని అందిస్తున్న నాయకులు

సివిల్స్ విజేత సాగర్‌కు సన్మానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యువత ఉన్నత చదువులో రాణించి ఉన్నత ఉద్యోగాలు పొందడమే నిజమైన అంబేద్కర్ భావజాలమని ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. ఇటీవల మండలంలోని తాడువాయి పంచాయతీ జొన్నవారిగూడేనికి చెందిన సాగర్ సివిల్స్‌లో ఐఆర్‌ఎస్ సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో సాగర్‌ను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎలిజా మాట్లాడుతూ తల్లిదండ్రులు లేకపోయినా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదువుకుని సివిల్స్ పరీక్షల్లో ఐఆర్‌ఎస్ సాధించిన సాగర్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. లక్ష్యాన్ని సాధించే దిశగా యువత కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ పి.రాజేష్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వెంప ఐజాక్ పాల్గొన్నారు.



సాగర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఎలిజా, సిఐ రాజేష్

స్కూల్ స్వీపర్ల వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

మూడో రోజు దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు
నోటికి నల్లరిబ్బన్లతో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అతి తక్కువ వేతనాలతో పనిచేసే చిరుద్యోగుల పట్ల జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరి దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా కలెక్టర్ మున్సిపల్ స్కూల్ స్వీపర్ల సమస్యపై వెంటనే స్పందించి వారికి రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షలను ప్రారంభించిన లింగరాజు మాట్లాడుతూ జిఒలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ఆయన ప్రశ్నించారు. జిఒ 84 విడుదల చేసి 15 మాసాలవుతున్నప్పటికీ దానికనుగుణంగా చర్యలు చేపట్టి మున్సిపల్ స్కూలు స్వీపర్ల బకాయి జీతాలు చెల్లించడంలో జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుందని ఆయన విమర్శించారు. జిల్లా అధికారులు స్పందించి స్కూల్స్ స్వీపర్లకు రావాల్సిన బకాయి జీతాలు ఇప్పించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా అధికారులు కనీసం మానవత్వం లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. ఒకటో తేదీన జీతాలు రాకపోతే అల్లాడే అధికారులు, ఐదు నెలలుగా జీతాలు లేకుండా స్కూల్ స్వీపర్లు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ దీక్షలకు యూనియన్ అధ్యక్షురాలు జె.స్వాతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఈతకోట చిన్ని, వి.విజయలక్ష్మి, పి.రత్నమణి, పి.నాగమణి, కృష్ణవేణి, ఖాదరున్నీసా, ఆదిలక్ష్మి, రామలక్ష్మి, నాయకత్వం వహించారు.



మాట్లాడుతున్న ఆర్.లింగరాజు

మూడో రోజు దీక్షల సందర్భంగా ఆందోళనకారులు నోటికి నల్లరిబ్బన్లతో తమ నిరసన తెలిపారు. ఈ దీక్షలకు యుటిఎఫ్ జిల్లా నాయకులు పివి.నరసింహారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబులు సంఘీభావం తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - ముసునూరు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరంకృష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు బి.నరసింహారావు, ఎంపిడిఒ జి.రాణి, తహాశీల్దార్ దాసరి సుధ, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రజలందరికి ఆరోగ్య వైద్య సేవలు ఉచితంగా ఇంటింటా అందించాలనే సదుద్దేశ్యంతో సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామగ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని అక్కుపల్లి గోకవరంలో గురువారం నిర్వహించిన హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. సర్పంచి మిద్దే సత్యవతి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపిడిఒ ప్రేమాన్విత, ఎంపిటిసి సభ్యులు విజయనిర్మల, మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన పరిశీలించారు.

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మోతేవారితోట అర్బన్ హెల్త్ సెంటర్ ఎనిమిది సచివాలయల పరిధిలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అధ్యక్షత వహించారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ2 గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు పరీక్షలు చేసి 258 మందికి వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఉన్నాయని గుర్తించి వారికి మందులు అందించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎన్.మురళీ మోహన్, జ్యోతి, చిమటబోయిన పుల్లారావు, ఎంపిటిసి సభ్యులు చింతకుంట్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ముసునూరులో...

పోలవరం : మండలంలోని జిల్లెల్లగూడెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.గంగాదేవి, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, తహాశీల్దార్ బి.సుమతి, ఎఒ సిహెచ్.శ్రీనివాసబాబు, పిహెచ్‌సి డాక్టర్ రేణుక, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వేలేరు - లంకాలపల్లి రోడ్డును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన వేలేరు నుండి లంకాలపల్లి వరకూ అధ్వానంగా ఉన్నప్రధాన రహదారి నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ పెద్ద పెద్ద గోతులతో అత్యంత దుర్భరంగా ఉన్న ప్రధాన రహదారిపై నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప నిర్మాణపనులు మాత్రం చేపట్టడం లేదని విమర్శించారు. వెంటనే వేలేరు నుండి లంకాలపల్లి వరకూ 45 కిలోమీటర్ల ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో విషజ్వరాల బారిన పడి అనేక మంది మరణిస్తున్నారని, వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రతీ గ్రామంలో వైద్యాధికారులు పర్యటించి మెడికల్ క్యాంపులు పెట్టి ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని, డెంగీ, మలేరియా తదితర పరీక్షలు ఉచితంగా చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వృద్ధులు, చిన్న పిల్లలు రోడ్లమీదకు రావాలంటే భయపడుతున్నారని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజల జీవితాలతో అటు పాలకులు ఇటు అధికారులు ఆడుకుంటున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించేలా చేస్తూ న్యూస్ క్లిక్‌పై దాడి చేయించి భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా చేయడం దుర్మార్గపు చర్యఅని ఖండించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు, ఎం.బాబు, లక్ష్మయ్య, మహబూబ్ పాషా, లక్ష్మణరావు, వలీ పాషా, రమేష్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కొయ్యలగూడెం పంచాయతీ పరిధిలోని సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీల నిర్మాణపనులకు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.28 లక్షలు ఎన్ఆర్ఇజిసి, పంచాయితీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎస్‌సి, ఎస్‌టిలు ఉన్న ప్రాంతంలో డ్రెయినేజీ పనులు 30 రోజుల్లో పూర్తయ్యేలా ప్రణాళిక చేసినట్లు పాలకవర్గం తెలిపింది. పోలవరం రోడ్డుకు కూడా డ్రెయినేజీ పూడిక తీస్తున్నారు.

జాన్సీలక్ష్మి మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఉంగుటూరు


జాన్సీలక్ష్మి (ఫైల్ ఫోటో)

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.జాన్సీలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె మృతికి కళాశాలలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ లెక్చరర్ డాక్టర్ బి.జాన్సీలక్ష్మి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఉండగా గుంటూరులో మృతి చెందారన్నారు. ఆమె మృతికి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సంతాపం తెలిపారు.

నేరాలు - ఘోరాలు


వివరాలు తెలుపుతున్న పోలీసులు

ఏలూరులో సుపారి గ్యాంగ్ హల్‌చల్

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వ్యక్తిని బెదిరించి బాధితుడికి రావాల్సిన రూ.50 లక్షల నగదును మాఫీ చేసేందుకు ప్రయత్నించిన ఓ ముఠాను పోలీసులు పట్టుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నారు. నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ బి.చంద్రశేఖరరావు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహిం వివరాలు తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం ప్రాంతానికి చెందిన అన్నే కాంతారావు స్థానికంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో 2017 నుంచి 2019 మధ్యకాలంలో గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నివాసం ఉండి, ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్న దాట్ల బాలవెంకటసత్యనారాయణ అలియాస్ సతీష్ రాజుకు, కాంతారావుకు పరిచయం ఏర్పడింది. తనకు విదేశాల్లో ఎస్‌బిఎల్‌సి ఎకౌంట్ ఉందని, అది కొన్ని అనివార్య కారణాల వల్ల ఫ్రీజ్ అయిందని, ఆ ఎకౌంటును రిలీజ్ చేస్తే దాంట్లో పెద్ద మొత్తంలో నగదు ఉందని, తనకు రూ.50 లక్షలు ఇస్తే ఆ ఎకౌంటును ఫ్రీజ్ నుంచి విడిపించి ఖాతాలో ఉన్న నగదు నుంచి రూ.2 కోట్లు తిరిగి ఇస్తానని సత్యనారాయణ కాంతారావును నమ్మించాడు. 2017 నుంచి 2019 వరకూ దఫాదఫాలుగా మొత్తం రూ.50 లక్షలు సత్యనారాయణకు కాంతారావు ఇచ్చారు. అప్పటి నుంచి అతను కాంతారావుకు కనపడకుండా తిరుగుతూ వచ్చాడు. అయితే సతీష్‌రాజు సిబిఐ కోర్టులో బెంగళూరు ప్రాంతంలో హాజరవుతున్నాడని తెలుసుకున్న కాంతారావు గతనెల 19వ తేదీన కోర్టు వద్ద తనకు ఇవ్వాల్సిన సొమ్ముల కోసం నిలదీసేందుకు అతని వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అతని పక్కన హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వినయ్‌రెడ్డి అనే వ్యక్తి ఉన్నాడు. అతను మీరిద్దరి మధ్య సంధి చేస్తానని, రెండు మూడు రోజుల్లో ఆర్థిక లావాదేవీలను సెటిల్ చేస్తానని కాంతారావుకు తెలిపాడు. గత నెల 26వ తేదీన కాంతారావుకు వినయ్‌రెడ్డి ఫోన్ చేసి 27వ తేదీ మధ్యాహ్నం ఏలూరు ఎన్-స్క్వేర్ హోటలకు రావాలని, తామిద్దరం వస్తున్నామని, అప్పు సొమ్ము ఇచ్చివేస్తామని చెప్పారు. 27వ తేదీ మధ్యాహ్నం ఎన్-స్క్వేర్ హోటల్‌కి వచ్చిన కాంతారావును వారిద్దరు గదిలో బంధించారు. ఆ తరువాత నలుగురు వ్యక్తులు వచ్చి తాము తెలంగాణా ఎన్ఎస్‌టి ఫోర్స్ పోలీసులమని కాంతారావుపై అరెస్టు వారెంటు ఉందని, అందుకే అరెస్టు చేస్తున్నామని అతనిని గదిలో చిత్రహింసలకు గురిచేసి కొట్టారు. అక్కడ నుంచి కాంతారావును ఆ నలుగురు ఇన్నోవా కారులో ఎక్కించుకుని తాడేపల్లిగూడెం వైపు తీసుకెళ్లి మళ్లీ వెనుకకు తీసుకొచ్చి దెందులూరు జాతీయ రహదారిలోని ఓ నిర్మానుష ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ అతని తలపై తుపాకీ పెట్టి చంపేస్తామని బెదిరిస్తూ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. భయభ్రాంతులకు గురైన కాంతారావు తనను వదిలేస్తే డబ్బులు తిరిగి అడగనని వారిని బ్రతిమాలడంతో మళ్లీ అదే కారులో తీసుకొచ్చి రూమ్ నెంబర్ 506లో ఉన్న వినయ్‌రెడ్డికు అప్పగించి మేటర్ సెటిల్ అయిపోయిందని, అప్పు సొమ్ము అడగరని చెప్పి ఆ నలుగురు వెళ్లిపోయారు. ఈ సంఘటనపై బాధితులు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూ టౌన్ సిఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరిలో ప్రధాన నిందితులైన సతీష్, వినాయ్‌రెడ్డిలను పోలీసులు ఈ నెల నాలుగో తేదీన సిఐ చంద్రశేఖరరావు అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారును రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దాట్ల సత్యనారాయణ కాంతారావును మోసం చేసి దఫాదఫాలుగా రూ.50 లక్షలు తీసుకున్నాడని, ఆ సొమ్ము బదులుగా తన పేరుపై ఉన్న చరాస్తిని తనకు రాసి ఇవ్వాలని ఒత్తిడి తెస్తుండడంతో అతడిని సినిమా తరహాలో బెదిరించేందుకు సుపారి గ్యాంగ్‌ను మాట్లాడాడు. సుపారిగ్యాంగ్‌కు సత్యనారాయణ ముందుగా రూ.2.50 లక్షలను అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఈ కేసులో నాగరాజుతో పాటు మరో ముగ్గురు నిందితులు ఉన్నట్లు గుర్తించామని సిఐ తెలిపారు. వీరందరినీ పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

పశ్చిమ రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు


మృతిచెందిన సురేష్

తాడేపల్లిగూడెం వద్ద యాగరపల్లి ఫ్లైఓవర్‌పై గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిడమర్రుకు చెందిన ఎలుబండి సురేష్ ఆసుపత్రి పని నిమిత్తం బైక్‌పై తాడేపల్లిగూడెం వెళ్లి పని ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం వద్ద యాగరపల్లి ఫ్లైఓవర్‌పై గుర్తు తెలీని వాహనం అతడిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సురేష్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి శవ పరీక్ష నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల వయస్సు, ఆరు మాసాల పిల్లలు ఉన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడకంవారిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళను కొయ్యలగూడెం గ్రామానికి చెందిన సుధీర్ రెండో పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత మద్యానికి బానిసై శారీరకంగా, మానసికంగా తనను వేధిస్తున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటి స్థలం లేదు... అద్దె ఇంట్లో ఉండే స్తోమత లేదు

ముసునూరువాసులకు కేటాయించని ఇళ్లస్థలాలు
గుడిసెల్లో నివాసం ఉంటున్న వైనం
సౌకర్యాలు లేవని ఆవేదన
పట్టించుకోని అధికారులు


పేదల నివసిస్తున్న గుడిసెలు

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా.. మరో కొన్ని నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నా.. ఇప్పటివరకు ముసునూరులో ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయిస్తే నేటికీ కూడా ఇంటిస్థలం లేక నిరుపేద కుటుంబాలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కూడా అదే పరిస్థితి ఉందని ప్రజలు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో స్థలంతో పాటు గృహ నిర్మాణం కూడా చేపడతామని హామీ ఇచ్చిన నాయకులు మాట మార్చారని ముసునూరు మండలంలో ఇళ్ల స్థలాల విషయంలో పక్కాగా కనిపిస్తుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇళ్లస్థలాలు ఇప్పటిస్తానని ఇప్పటి ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హామీ ఇచ్చారు. ఆ హామీ అప్పుడు, ఇప్పుడు కూడా అమలు కాలేదు.

వైసిపి అధికారం లోకొచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో గృహ నిర్మాణం కూడా చేపట్టారు. కాని ముసునూరు మండల కేంద్రమైన ముసునూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో జగనన్న ఇళ్ల స్థలాలు చూపకపోవడం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమా, అధికారుల అలసత్యమా అనేది చెప్పలేని పరిస్థితి ఉంది.

అప్పు చేసి డబ్బులు కట్టాం
నక్కా రామయమ్మ



మాది పేద కుటుంబం. స్థలం ఇస్తామంటే అప్పుచేసి మరీ రూ.రెండు వేలు కట్టాము. నేటికీ స్థలం ఇవ్వలేదు.

సౌకర్యాలు లేవు
వేల్పూరి ఏసు



మేము సుమారు 15 ఏళ్ల నుంచి ఇక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నాం. కరెంట్, తాగునీరు లేవు. నాయకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. ఎంఎల్ఎ కూడా పట్టించుకోవడంలేదు.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నాం
పోట్రు చిట్టిమ్మ



మా ప్రాంతంలో కరెంట్, తాగునీరు సౌకర్యాలు లేవు. దోమలు, పాములతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇంటి స్థలం లేదు. అద్దె ఇంట్లో ఉండే స్తోమత లేదు. రెక్కాడితే గాని డొక్కడని మా బతుకులు ఏ నాయకుడు మారుస్తాడో.

పట్టాలు ఇచ్చారు కాని స్థలాలు చూపలేదు
నక్కా వీరయ్య



సిపిఎం వారు అండగా ఉన్నారు. తహశీల్దార్, నూజివీడు సబ్ కలెక్టర్, మచిలీపట్నం జిల్లా కార్యాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం లేదు. వైసిపి అధికారంలోచ్చింది. సిఎం జగన్ ఇంటి స్థలం ఇచ్చి ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. పట్టాలు ఇచ్చారు కాని స్థలాలు ఇప్పటికీ చూపించలేదు.


12న జిల్లా స్థాయి రైతు సదస్సు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 12వ తేదీన ఏలూరులో ధాన్యం గిట్టుబాటు ధర – కొనుగోలు సమస్యలపై జిల్లా స్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నామని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. ఈ మేరకు మండలంలోని కైకరం ప్రజాసంఘాల కార్యాలయంలో సదస్సు కరపత్రాలను రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు ఏమాత్రం సరిపోదన్నారు. క్వింటాల్ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సాధారణ రకానికి రూ.2183, ఎ గ్రేడ్‌కు రూ.2203గా ఉందన్నారు. ఈ మద్దతు ధరకు అదనంగా కేరళలోని వామపక్ష ప్రభుత్వం రూ.900 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పైసా కూడా ధాన్యానికి బోనస్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వస్తున్న సమస్యలు పరిష్కరించేందుకు రైతు సంఘాలు, రైతులతో జిల్లా అధికారులు సంయుక్త సమావేశాలు నిర్వహించాలని కోరారు. తేమ శాతం, తూకం ఆర్‌బికెలో నిర్ణయించిన ప్రకారమే మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మిల్లర్లు రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడం ఆపాలన్నారు. రైతు ధాన్యం తోలిన వారం రోజుల్లో నగదు బ్యాంకుల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 9:30 గంటలకు ఏలూరు, కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో జరుగుతున్న ఈ సదస్సులో ధాన్యం రైతుల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు హాజరవుతున్నారని చెప్పారు. ధాన్యం మద్దతు ధర కోసం జరుగుతున్న జిల్లా స్థాయి రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తి కొండ వెంకటకృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు కోనా శ్రీ నివాసరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పా రావు, కో-కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

లోపూడిలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు


వెల్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

గ్రామ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించే దిశగా గ్రామాల్లో కూడా వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభిస్తున్నట్లు నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామంలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు బి.నరసింహరావు, వైద్యులు ఎం.కిరణ్‌కుమార్, కరిముల్లా, నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

మహిళకు రోషన్‌కుమార్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి


మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న రోషన్‌కుమార్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటానికి ఎప్పుడూ ముందుంటానని టిడిపి చింతలపూడి నియోజకవర్గ యువ నాయకులు సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో నిస్సహాయ స్థితిలో ఉన్న జ్యోతి శకుంతల ఎటువంటి ఆధారం లేక ఇబ్బంది పడుతుంది. ఈ విషయాన్ని టిడిపి ధర్మాజీగూడెం నాయకులు రోషన్‌కుమార్ తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ దాతలెవరైనా ఉంటే ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకొచ్చేది టిడిపి ప్రభుత్వమేనన్నారు. అనంతరం జ్యోతిశకుంతల మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న తనను ఆదుకున్న రోషన్‌కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపతి సాంబశివరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, యర్రా బుజ్జియ్య, కర్రి మురళీ, పరసా రాజారావు, గజ్జా వెంకటేశ్వరరావు, గారపాటి శివయ్య, పరిమి శాంతయ్య, పరిమి భాస్కరరావు పాల్గొన్నారు.

న్యూస్ క్లిక్‌పై దాడులు పత్రికా స్వేచ్ఛను హరించడమే

జిల్లాలోఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - వీరవాసరం



వీరవాసరం : నిరసన తెలుపుతున్న నేతలు


మీడియారంగంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విషసంస్కృతిని విడనాడాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజనేయులు అన్నారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో మీడియా రంగంపై దాడులను ఖండిస్తూ గురువారం వీరవాసరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మీడియా రంగంపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ నాయకులు ఖండించాలన్నారు. న్యూఢిల్లీలో న్యూస్ క్లిక్ కార్యాలయంపై మోడీ ప్రభుత్వం చేసిన దాడి భావప్రకటనా స్వేచ్ఛ గొంతు నొక్కడమేనన్నారు. ఎటువంటి నేరారోపణలు చేయకుండానే ఉగ్రవాద నిరోధక చట్టం కింద న్యూస్‌క్లిక్ సంస్థ ఎడిటర్ ప్రబీర్‌పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు ఎడిటర్ ఎ.అమరయ్య, ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు జబ్బీర్ గుండా రామకృష్ణ, నవీన్, వి.రాధాకృష్ణంరాజు, నాని, ఎఎస్‌డివి.ప్రసాద్, నెల్సన్, సూర్య, ఎన్.శివ, పి.మోహన్, సాయిబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : న్యూస్ క్లిక్‌పై ఇడి దాడులు చేసినందుకు నిరసనగా పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు, ప్రజా సంఘాలు గురువారం నిరసన తెలిపాయి. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్.రవిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. మీడియా సభ్యులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి సాంబశివరావు, ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి.వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు మండెల అప్పలరాజు, సరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌గా ఎంఎల్ఎ గ్రంధి

కేబినెట్ సహాయ మంత్రి హోదా కల్పించిన ప్రభుత్వం
భీమవరం వైసిపి శ్రేణుల్లో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి - భీమవరం


గ్రంధికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రంధికి కేబినెట్ సహాయ మంత్రి హోదాను ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో భీమవరం వైసిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ప్రభుత్వ విప్‌గా ఆయన నియామకం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ఆయనను అభినందనలతో ముంచెత్తారు. భీమవరం రాజకీయ చరిత్రలో గ్రంధికి ప్రత్యేకస్థానం ఉంది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై గెలుపొందడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు మార్మోగింది. జనసేన అధినేతపై గెలుపొందడంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమని అప్పట్లో ప్రచారం సాగింది. కానీ సామాజిక వర్గ సమీకరణాల కారణంగా ఆ పదవి అందుకోలేకపోయారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ఆరంభమవుతున్న తరుణంలో ఆయనకు కేబినెట్ సహాయ మంత్రి హోదా కలిగిన విప్ పదవి వరించడం విశేషం.

మంత్రి పదవి కన్నా జిల్లా కేంద్రమే ముఖ్యమన్న గ్రంధి

జిల్లాల పున:వ్యవస్తీకరణలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు ఏర్పడ్డాయి. భీమవరం జిల్లా కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లాను ఏర్పాటు చేశారు. తొలుత జిల్లాకేంద్రం నరసాపురంను ప్రతిపాదించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఈ సమయంలో గ్రంధి తనకు మంత్రి పదవి కన్నా భీమవరం జిల్లా కేంద్రం కావడమే ముఖ్యమని చెప్పి జిల్లాకేంద్రం సాధనకు విశేష కృషి చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కీలక తరుణంలో గ్రంధికి విప్ పదవి కేటాయించడం పట్ల చర్చ సాగుతుంది. రాజకీయ సమీకరణలో భాగంగా భీమవరంలో ప్రధాన పార్టీలను ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే సహాయ మంత్రి హోదాను కట్టబెట్టారనే ప్రచారం సాగుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలపై జనసేన, టిడిపి కూటమి పట్టు బిగిస్తున్న తరుణంలో టిడిపికి బలమైన బిసి ఓట్ బ్యాంకు ఉండగా, జనసేన పార్టీ ప్రధానంగా కాపు సామాజిక తరగతి ఓట్లపై దృష్టి సారించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. జనసేన, టిడిపి వ్యూహాలను చిత్తుచేసే క్రమంలో గ్రంధికి ఈ పదవిని కేటాయించినట్లు ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. బిసి, కాపు సామాజిక తరగతుల ఓట్లను గెలుచుకునే సత్తా గ్రంధికి ఉందని, వచ్చే ఎన్నికల్లో వైసిపి మరింత బలపడుతుందని అంచనా వేస్తున్నారు.


హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

24 రోజులకు రూ.1.81 కోట్ల ఆదాయం

చినవెంకన్న ఆలయ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలోని ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి హుండీల ద్వారా రూ.1,81,71,372 ఆదాయం లభించింది. ఆలయ హుండీలను గురువారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. 24 రోజులకు గాను జరిగిన ఈ లెక్కింపులో నగదు రూపేణా పైన పేర్కొన్న మొత్తం, బంగారం 475 గ్రాములు, వెండి 6 కేజీల 14 గ్రాములు, పాత రూ.500 నోట్లు 34, రూ.వెయ్యి నోట్లు రెండు, విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని, సమాజంలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా నిజాయితీగా నిలబడాలని ఎంఎల్ఎ ఆళ్ల కాళీ కృష్ణప్రసాద్ (నాని) తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్ తోకల రాజేష్‌బాబుకు ఆర్డర్ కాపీ ఇస్తూ నిజాయితీగా దళితులకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయి సుధీర్‌బాబు, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, మంచెం మైబాబు, మేతర సురేష్, బండారు కిరణ్, తిప్పాని, రామ్మోహన్ శేషు, సత్తార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో 'ఓయ్ ఇడియట్ 'చిత్రం ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నుంచి ఎందరో సినీ కళాకారులు దేశ వ్యాప్తంగా పేరుపొందారని, తాను ఈ చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నానని సినీహీరో యశ్వంత్ చెప్పారు. గీతా అన్నపూర్ణ థియేటర్లో ఓయ్ ఇడియట్ చిత్రాన్ని గురువారం ప్రదర్శించారు. పాలకొల్లుకు చెందిన నిర్మాత పుల్లేటి శ్రీనుబాబు పాల్గొని మాట్లాడారు. పాలకొల్లులో చిత్ర ప్రదర్శన జరగడం ఆనందదాయకమన్నారు. ఇది విలువలతో కూడిన మెసేజ్ ఓరియంటెడ్ చిత్రమని, కుటుంబ సమేతంగా చూడదగ్గ మంచి కుటుంబ చిత్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల విద్యాసంస్థల డైరెక్టర్ రాఘవరెడ్డి, ప్రముఖులు చుండూరి శ్రీరంగ నాయుడు, తులా రామలింగేశ్వరరావు, ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి, ఎఎస్ఐ మద్దాల శివాజీ,డా ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్ పాల్గొన్నారు.

కరాటేలో ఆదిత్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ

భీమవరం రూరల్:రాష్ట్ర షాటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్-2023లో ఆదిత్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఏలూరులోని బాకో కళ్యాణ మండపంలో ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో స్థానిక ఆదిత్య స్కూల్ విద్యార్థులు జి.తనీష్‌ప్రేమ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఎం రేవంతకుమార్, ఎస్‌కె.ఫయాజ్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారని స్కూల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన స్కూల్ కరాటే మాస్టార్ సాయిబాబును, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.